క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో ఈ నెల11న అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాధరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూల్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11కేవీ వేణుగోపాలపురం ఫీడర్ యందు నిర్వాహణ పనుల నిమత్తం చెట్టు కొమ్మలను తొలగించే క్రమంలో పాలిటెక్నిక్ కళాశాల, సిద్ధి వినాయక నగర్, నంది గుడ్డి కాలనీ, అయ్యప్ప నగర్, ఆహ్లాదా లే అవుట్, ఉట్టిగడ్డ కాలనీ, డైట్ కాలనీలకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతంలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్ రేపు

విజయనగరం అర్బన్: స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 11న డాక్టర్ రెడ్డీస్ సంస్థ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్పాదక కేంద్రాల వద్ద సెల్ఫ్ మేనేజ్డ్ టీమ్స్ మరియు అప్రెంటీస్ ట్రైనీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ బైపీసీలలో మరియు డిప్లమా మరియు బీఎస్సీ/ఎంఎస్సీ (కెమిస్ట్రీ)లో 60 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. సెల్ఫ్ మేనేజ్ టీమ్స్ అప్రెంటీస్ ట్రైనింగ్‌లో రెండు సంవత్సరాల పాటు ఉచిత వసతి, భోజనం కల్పిస్తారని తెలియజేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ ఉమ్మడి జిల్లాల అభ్యర్థులు నేరుగా ఆ రోజు ఎంపిక ప్రాంగణానికి హాజరయి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

మినిమమ్ టైం స్కేల్ అమలుకు డిమాండ్

నెల్లిమర్ల: తమకు మినిమమ్ టైంస్కేల్ అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు ప్లకార్డులతో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో సూర్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, పీటీఐలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

భోగాపురం: భోగాపురం ఉన్నత పాఠశాలకు 1982 – 83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం వితరణ కార్యక్రమం నిర్వహించారు. తమ వంతుగా ఉదయం పూట అసెంబ్లీ నిర్వహణకు పబ్లిక్ అడ్రెసింగ్ పరికరాలను హెచ్‌ఎమ్ శ్రీనివాసరావుకు అందజేశారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అడపా ప్రసాద్, శ్రీను, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జేసీ అభినందన


మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: కేంద్రీయ విద్యాలయంలో గురువారం జరిగిన విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ మీటింగ్ జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో గత సంవత్సరం పరీక్షలలో క్రీడలతో విద్యాలయం సాధించిన అత్యుత్తమ ఫలితాలను ఆయన ప్రశంసించారు. విద్యాలయం సాధించిన వంద శాతం ఉత్తీర్ణత ఫలితాలను అభినందస్తూ ఈ ఏడాది విద్యార్థులకు పాఠ్యాంశాలు, క్రీడలతో పాటు కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేకమైన తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ దిలీప్‌మోడీ, మెప్మా పీడీ జీవీ చిట్టిబాబు, విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• భక్తుల అవస్థలు

సింహాచలంలో బుధవారం జరిగిన గిరిప్రదర్శనకు వెళ్లేందుకు సిద్ధమైన భక్తులకు విజయనగరం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అవస్థలు తప్పలేదు. అవసరం మేరకు బస్సులు లేకపోవడంతో సింహాచలం వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భక్తులు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఒక్కసారిగా చేరుకోవడంతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



మోసం చేయడం చంద్రబాబు నైజం

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు– ప్రతి గడపకూ చంద్రబాబు మోసాలు
- అలుగోలులో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ విస్తృత స్థాయి సమావేశం
- నాలుగు గ్రామాల్లో కొనసాగిన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ
- హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స, పార్టీ నేతలు


అలుగోలులో బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ బ్రోచర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఎన్నికల ముందు ఒక మాట, తరువాత ఒక మాట మాట్లాడడం చంద్రబాబుకు అలవాటే అని.. ప్రజలను మోసం చేయడం ఆయన నైజమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని అలుగోలు గ్రామంలో బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీ పేరిట మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చారని, పథకాలకు ఆకర్షితులై ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు సరికదా హామీలన్నీ అమలు చేసేశామని స్వయంగా చంద్రబాబే చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తల్లికి వందనం అమలు కేవలం వైఎస్సార్‌సీపీ పోరాట ఫలితమేనన్నారు. ఏడాదిలో కూటమి పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సమస్యలపై రోడ్లపైకి వస్తే విశేష ప్రజాదరణ లభిస్తుందని, చూసి ఓర్వలేక అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రజలకు ఏ మాత్రం అందుబాటులో ఉండడం లేదని, నియోజకవర్గాన్ని అమెరికా చేస్తామని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికి నేడు చేతులెత్తాశారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గ్రహించాలని హితవు పలికారు.

హామీలు విస్మరించింది : ఎమ్మెల్సీ పెనుమత్స

మేనిఫెస్టోను పవిత్ర గ్రంధంగా భావించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే పథకాలు అమలు చేసి మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. గత ప్రభుత్వంలో చిత్త శుద్ధితో అమలు చేసిన సంక్షేమ పథకాలు, విధానాలను, ప్రస్తుతం చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానాలపై ప్రజలను చైతన్యపరచాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని ప్రజలకు చూపించి, ఏ విధంగా మోసం చేశారో తెలియజేయాలని పార్టీ శ్రేణులకు నిర్దేశించారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యపరిచి

అలుగోలు, జోగిరాజుపేట, వల్లూరు, బొప్పడాం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్సతో పాటు నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను గుర్తు చేస్తూ రూపొందించిన రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్ తో ఉన్న బ్రోచర్‌ను ప్రజలకు అందజేశారు. ఏడాదిలో ఏ పథకాలు అందుకున్నారు..ఎంత మేర లబ్ధి చేకూరిందనే ప్రశ్నలు వేశారు. లబ్ధిదారులు తెల్ల మొహాలు వేయడంతో..


వల్లూరు గ్రామంలో వృద్ధురాలికి బ్రోచర్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

మోసపోయామంటూ ప్రజలే స్వయంగా చెప్పుకొచ్చారు. గత జగనన్న ప్రభుత్వానికి, ఇప్పటి కూటమి ప్రభుత్వానికి తేడా గుర్తించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు గదల సన్యాసినాయుడు, చిక్కాల సాంబశివరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంతం నాయుడు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాయకులు మత్స సత్యనారాయణ, దంతులూరి గిరిబాబు, జమ్ము అప్పలనాయుడు, ఆల్తి ఆదినారాయణ, సంగంరెడ్డి జగన్నాధం, అంబళ్ల కిరణ్, చనమళ్ల తులసి, కర్రోతు వెంకటరమణ, లెంక గోవింద, బొంతు పురుషోత్తం, పంచాది శ్రీరాములనాయుడు, కంది శ్రీనివాసరావు, పతివాడ కృష్ణవేణి, నల్లి శ్రీను, గేదెల రామచిరంజీవి, తర్లాడ దుర్గారావు, మహంతి జనార్ధన్, బెల్లాన రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు

- పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన చిన్న శ్రీను సోల్జర్స్

విజయనగరం: శాసనమండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లమ్మవారి ఆలయంలో బొత్స సత్యనారాయణ పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నిరుపేదలకు ఉచితంగా చీరలు, ప్రసాదాలను పంచిపెట్టారు. నగరంలోని చెవిటి, మూగ పాఠశాలల్లో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ వారందరికీ ఉచితంగా బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ధర్మపురిలో గల సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో 100 మంది నిరుపేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


చెవిటి, మూగ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న సిరిసహస్ర

నేత్ర వైద్య శిబిరం

విజయనగరం అర్బన్: మాజీ మంత్రి, సత్య విద్యా సంస్థల చైర్మన్ బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు స్థానిక సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో బుధవారం వేడుకగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటరీలకు చికిత్స అందిచారు. తొలిత జన్మదిన శుభాకాంక్షలు తెలిపే కేక్‌ను కట్ చేసి విద్యార్థులు, కళాశాల సిబ్బంది పంచుకున్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాయిదేవమణి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవానికి ప్రతిరూపం గురువు

- ఉపద్రష్ట వేంకట వరప్రసాద్


అతిథులను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: గురువు కంటికి కనిపించి మన ముందు నడయాడే దైవమని, దైవానికి ప్రతిరూపం గురువు అని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సాయి సత్సంగ సేవా సంఘం వ్యవస్థాపకులు ఉపద్రష్ట వేంకట వరప్రసాద్ పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి, కుసుమంచి ఫౌండేషన్ సంయుక్తంగా పూల్‌బాగ్‌లో కుసుమంచి ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీకటి నుంచి వెలుగుకు దారి చూపేది గురువు అని, గురుశిష్య బంధం ఎంతో పవిత్రమైనదని, ఆధ్యాత్మిక పథంలో గురువు పాత్ర చాలా ప్రధానమైనదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేంకట వరప్రసాద్‌ను, కంచర్ల రాజేశ్వరరావులను తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, కుసుమంచి ఫౌండేషన్స్ అధ్యక్షులు కుసుమంచి సుబ్బారావులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌బీటీ మార్కెట్ పూర్వ అధ్యక్షులు పులిపాటి రామారావు, ధవళ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల రైల్వే పెన్షన్‌దారులు అప్రమత్తం


సైబర్ నేరాల పట్ల రైల్వే పెన్షన్‌దారులకు అవగాహన కల్పిస్తున్న శ్యామ్‌కుమార్

విజయనగరం టౌన్: సైబర్ నేరాల పట్ల రైల్వే పెన్షన్‌దారులు చాలా అప్రమత్తంగా ఉండాలని హెల్పేజ్ ఇండియా స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వేస్టేషన్ వద్దనున్న రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లాశాఖ కార్యాలయంలో ఆన్‌లైన్, సైబర్ మోసాల పట్ల బుధవారం ఆయన పెన్షనర్లకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ సైబర్ మోసాలనేవి ఎలా జరుగుతాయి, ఎన్ని రకాలుగా ఉన్నాయి. వాటినుంచి తప్పించుకోవాలంటే సీనియర్ సిటిజన్లు ఏం చర్యలు తీసుకోవాలి, ఎలా కంప్లెంట్ ఇవ్వాలి. మొబైల్‌కి వచ్చే ఎటువంటి లింక్‌లైనా ఓపెన్ చేయరాదని, ఒకవేళ బాధితుడు నష్టపోయిన తొలి గంటను గోల్డెన్ అవర్ అంటారన్నారు. ఆ గోల్డెన్ అవర్‌లోనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆన్‌లైన్‌లో కంప్లయింట్ చేయడానికి సైబర్ క్రైమ్.జీఓవీ.ఇన్. వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్ హ్యాక్ కాకుండా ఉండాలంటే ఫోన్ సెట్టింగ్స్‌లో మార్పు ఎలా చేయాలన్నది నేర్పించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. వాట్సాప్ టూ స్టెప్స్ వెరిఫికేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్‌పై అవగాహన

పూసపాటిరేగ : మండలంలోని కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్‌లో పారా స్పోర్ట్స్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా స్పోర్ట్స్ అసోసియేషన్ కరపత్రాలును విడుదల చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.దయానంద్ మాట్లాడుతూ దివ్యాంగులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, క్రీడలు ద్వారా శారీరక మానసిక వికాసం కలుగుతోంది అన్నారు. పారా క్రీడలు ఆడే దివ్యాంగుల కోసం ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. జీవో నంబరు 4 ద్వారా 3 శాతం ప్రభుత్వ ఉద్యోగాలకు ఎటువంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండా భర్తీ చేస్తారన్నారు. దివ్యాంగులు ఉద్యోగాలు సాధించడానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలు ఆడాలని సూచించారు. విశాఖలో 22 ఎకరాలలో అత్యాధునిక స్టేడియం నిర్మిస్తున్నారన్నారు. దివ్యాంగులు పారా స్పోర్ట్స్ ఆడాలని సూచించారు.

సంక్షిప్తంగా..

పైడితల్లి చండీయాగం

విజయనగరం టౌన్: రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి ఆలయం ఆవరణలో అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని బుధవారం వేదపండితులు చండీయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగం విశిష్టతను భక్తులకు వివరించారు. యాగం అనంతరం అమ్మ వారి శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. వేదపండితులు ఎ.సాయికిరణ్ శర్మ, వెలువలపల్లి నరసింహమూర్తి, అర్చకులు నేతేటి ప్రశాంత్ పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదని ప్రజారోగ్యాధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి పేర్కొన్నారు. నగరంలో సంపూర్ణ పారిశుధ్య విధానం అమలులో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. మంగళవారం అర్ధరాత్రి, బుధవారం ఉదయం ప్రజారోగ్య అధికారి కొండపల్లి సంబంధమూర్తి పారిశుధ్య విధానం అమలు తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా రాత్రిపూట నిర్వహిస్తున్న పరిశుభ్రత కార్యక్రమాల తీరును గమనించారు. స్థానిక కన్యక పరమేశ్వరి ఆలయ సమీపంలో ఓ దుకాణ సముదాయం వద్ద రహదారిపై విచ్చలవిడిగా అధిక మొత్తంలో చెత్తాచెదారాలు పడవేయడానికి గమనించారు. తక్షణం పారిశుధ్య పర్యవేక్షకుడిని పిలిచి చెత్తను రహదారిపై వేసిన సదరు దుకాణ యజమానికి అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు. బుధవారం ఉదయం కొంత మంది వీధివిక్రయదారులు గంటస్తంభం ప్రాంతంలో వ్యర్థాలను రహదారులపై వేయడాన్ని గమనించిన పారిశుధ్య సిబ్బంది వారికి అపరాధ రుసుమును విధించారు.

కార్మికుల హక్కుల అణిచివేత

విజయనగరం గంటస్తంభం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం తలపెట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. విజయనగరంలో ఆయన సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో ఎందరో కార్మికులు ప్రాణాలు త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని హక్కుని సైతం పెంచుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. అదే జరిగితే కార్మికులు కట్టు బానిసలుగా మారిపోతారని అన్నారు.

గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధం


రింగురోడ్డు సింహాద్రినగర్‌లోని శ్రీషిరిడి సాయి బాబా ఆలయం

విజయనగరం టౌన్: నగరంలోని రింగ్‌రోడ్డు సింహాద్రి నగర్‌లో గల శ్రీషిరిడి సాయిబాబా ఆలయం గురువారం జరగనున్న గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన ఏర్పాట్లు చేయనున్నట్టు అలయ అధ్యక్షులు కరణం జనార్ధనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున మూలవిరాట్‌కు అభిషేకం చేసిన అనంతరం కాకడ హారతి, నగర సంకీర్తనలతో ప్రారంభమైన కార్యక్రమాలు సాయంత్రం పల్లకీ ఉత్సవం, శ్రీగురుచరిత్ర పారాయణాలతో పాటు రాత్రి భజనలతో ముగుస్తాయని తెలిపారు.

సార్వత్రిక సమ్మెకు బాసట


నిరసనలో పాల్గొన్న గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని దేశ వ్యాప్తంగా ట్రేడ్ యూనియన్లు బుధవారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు అన్ని సంఘాలు బాసటగా నిలిచాయి. సమ్మెకు సంఘీభావంగా ర్యాలీలు నిర్వహించాయి. అన్ని సంఘాల నేతలు సమ్మెలో పాల్గొని కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేశాయి. భవిష్యత్‌లో వీటిపై మరింత పోరాటం చేస్తామని హెచ్చరించాయి. సమ్మెలో అన్ని సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

బారికేడ్లు వితరణ



ట్రాఫిక్ విభాగానికి బారికేడ్లు అందజేసిన మాక్సీవిజన్ ఐ ఆసుపత్రి యాజమాన్యం

విజయనగరం క్రైమ్ : విజయనగరం ట్రాఫిక్ పోలీసు విభాగానికి ప్రజా భద్రతను పెంపొందించడం, సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణను సులభతరం చేయడమే లక్ష్యంగా మాక్సీవిజన్ కంటి ఆసుపత్రి బారికేడ్లను వితరణగా అందజేసింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ నియంత్రించేందుకు ఈ బారికేడ్లు కొంత పోలీస్ శాఖకు సహకరిస్తాయని మాక్సీవిజన్ యాజమాన్యం స్పష్టం చేసింది. ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్ఐ రవి ఇతర సీనియర్ పోలీసు సిబ్బంది మరియు మాక్సీవిజన్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్య సమస్యలను పరిష్కరించడం యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ పద్మజ వివరించారు. హాస్పిటల్ మేనేజర్ రవితేజ, మాక్సీవిజన్ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

సుందర గోవింద సేవలు మరువలేనివి..


గోవిందరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హరీష్, తదితరులు

భోగాపురం: వైఎస్సార్‌సీపీకి సుందర గోవిందరావు అందించిన సేవలు మరువలేనివని ఆయన అభిమానులు కొనియాడారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సుందర హరీష్ ఆధ్వర్యంలో గోవిందరావు తృతీయ వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ..ఒక వైపు పార్టీ కోసం, మరో వైపు ప్రజల కోసం గోవిందరావు పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్దేశించిన జోన్లలోనే వీధి విక్రయాలకు అనుమతి

- గుర్తింపు కార్డు కోసం రూ.150 చెల్లించాలి
- నిషేధిత ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తే చర్యలు
- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నగర సుందరీకరణలో భాగంగా రానున్న రోజుల్లో నిర్దేశించిన జోన్‌లలో మాత్రమే వీధి విక్రయాలను అనుమతించనున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. బుధవారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో వీధి విక్రయదారుల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్, రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు ముందుస్తుగా గుర్తించిన జోన్‌ల వివరాలను వెల్లడించారు. ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా నగరాన్ని మూడు జోన్‌లుగా విభజించినట్టు ప్రకటించారు. ఇందులో భాగంగా రోడ్ జోన్ పరిధిలో కలెక్టరేట్ జంక్షన్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు, మయూరి జంక్షన్, బాలాజీ జంక్షన్, ఎంఆర్ కాలేజ్ జంక్షన్ నుంచి రాజీవ్ స్టేడియం వరకు, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ ఇన్ అండ్ అవుట్ గేట్లు, కోట జంక్షన్ నుంచి గుమ్చీ రోడ్, జిల్లా కోర్టు పరిధి ప్రాంతాలను గుర్తించటం జరిగిందన్నారు. ఈ ప్రాంతాలలో ఎక్కడా కూడా వీధివిక్రయాలు కొనసాగించరాదని స్పష్టం చేశారు. అలాగే గ్రీన్ జోన్‌గా దాసన్నపేట రైతు బజార్, బొంకులదిబ్బ, ఉడా కాలనీలు, వివేకానంద కాలనీ, అలకానంద కాలనీ, బీసీ కాలనీ, వీటీ అగ్రహారం, ప్రదీప్‌నగర్ కాలనీ, బాలాజీ నగర్, తోటపాలెం, బాబామెట్ట, అన్ని నివాసిత ప్రాంతాలలోనూ, గణేష్ టెంపుల్ రోడ్‌ను గ్రీన్ జోన్‌గా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ ప్రాంతాలలో నిత్యం వీధి విక్రయాలు కొనసాగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. అలాగే ఆరెంజ్ జోన్ కింద మూడు లాంతర్లు జంక్షన్, లోవర్ ట్యాంక్ బండ్ రోడ్డు నుండి ఐనాక్స్ వరకు, ఎస్‌బీఐ జంక్షన్ నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు, గురజాడ స్కూల్ జంక్షన్, గూడ్స్ షెడ్ రోడ్డు, కోడి రామ్మూర్తి వ్యాయామశాల దక్షిణం వైపు, గంటస్తంభం నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు, రైల్వేస్టేషన్ రోడ్, ఎంజీ రోడ్, అంబటి సత్రం రోడ్, ఆర్అండ్‌బీ రైతు బజార్ రోడ్డు ప్రాంతాలను గుర్తించటం జరిగిందని చెప్పారు. అక్టోబర్ రెండో తేదీ నుంచి నగరంలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుర్తించిన వీధివి క్రయదారులు 150 రూపాయలను తమ సిబ్బందికి చెల్లించి, రసీదు పొందాలని చెప్పారు. తద్వారా గుర్తింపు కార్డును పొందాలని చెప్పారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ సిహెచ్.సూరినాయుడు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, టీపీఆర్వో సింహాచలం, వీధివిక్రయదారుల సంఘం అధ్యక్షుడు సోమురాజు తదితరులు పాల్గొన్నారు.